క్లుప్తంగా

పేకాట స్థావరాలపై దాడి



నగరం: పేకాట, కోడి పందేలు, జూదం వంటి చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని రేపల్లె డీఎస్పీ అవుల శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరం మండలం వెలమవారిపాలెంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వెలమవారిపాలెంలోని సపోటా తోటలలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. 10 మందిని అదుపులోకి తీసుకుని, రూ.32,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాల గురించి ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఎస్ఐ భార్గవ్ పాల్గొన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి నిధులతో రోడ్లు



చుండూరు(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులతో సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. చుండూరు మండలంలోని మున్నంగి వారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రోజు 30 నుంచి 50 ఇళ్లను సందర్శించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్ పర్సన్ పూర్ణకుమారి, గ్రామ సర్పంచ్ శ్రీరామమూర్తి, సాంబరెడ్డి, ఎంపీడీవో సుదీప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అఖిలేష్ యాదవ్ యువతకు స్ఫూర్తిదాయకం



బాపట్ల: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ యువతకు స్ఫూర్తిదాయకమని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అఖిలేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ అఖిలేష్ యాదవ్ బీసీల అభ్యున్నతికి ఆదర్శమైన పాలన కొనసాగించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, విలియం బూత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్ లివింగ్‌స్టన్, అంజుమన్ కమిటీ బాపట్ల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం, కాండ్రు శరత్ కుమార్, మోర్ల చిన్న వెంకటేశ్వరరావు, బత్తుల వీరయ్య, బోయిన సూరిబాబు, దర్శి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

బీమా పథకాలను ఖాతాదారులు వినియోగించుకోవాలి



కర్లపాలెం: బ్యాంకుల ద్వారా అమలులో ఉన్న బీమా పథకాలను బ్యాంకు ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక యూనియన్ బ్యాంకులో జన సురక్ష పథకంపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఎక్కువ మొత్తంలో బీమా పథకాలు బ్యాంకుల ద్వారానే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎం శివకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న జన సురక్ష పథకంను 18 నుంచి 70 సంవత్సరాల లోపు వయస్సు వారికి పీఎం ఎస్‌బీవై ద్వారా సంవత్సరానికి రూ.20కే రూ.2 లక్షల ప్రమాద బీమా అందుబాటులో ఉందని తెలిపారు. 50 సంవత్సరాల వయస్సు వారికి పీఎం జేజేబీవై ద్వారా సంవత్సరానికి రూ.436 ప్రీమియంతో సహజ మరణం జరిగితే రూ.2 లక్షల బీమా అందుబాటులో ఉందని అన్నారు. ఇప్పటి వరకు యూనియన్ బ్యాంకులో ఖాతాలేని ప్రతి ఒక్కరూ జన్‌ధన్ ఖాతాలు తీసుకోవాలని సూచించారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారికి 60 ఏళ్ల తరవాత పెన్షన్ పొందే పథకం అందుబాటులో ఉందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస మాట్లాడుతూ ఖాతాదారులు సక్రమంగా ఖాతాను వినియోగిస్తున్నప్పుడే బీమా పథకాలు అమలులో ఉంటాయని తెలిపారు. ఆగిపోయిన ఖాతాదారులు సీకేవైసీ, రీకేవైసీ ఎప్పటికప్పుడు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఆర్‌సెటి డైరెక్టర్ బెనర్జి, బ్యాంకు సిబ్బంది అనీషా, భాను, శ్రీనివాసరావు, జగదీష్, గోపి, స్రవంతి, సందీప్, ప్రసాద్, సీఎఫ్ఎల్ సిబ్బంది మమత, శ్రీను ఖాతాదారులు పాల్గొన్నారు.



మెటల్ పోసి తారు వేయకుండా వదిలేసిన తెనాలి-అనంతవరం రహదారి



గుంతల మయంగా మారిన దోనేపూడి -పోతార్లంక రోడ్డు



మెటల్ వేసి వదిలివేసిన చినపులివర్రు - వేమూరు రోడ్డు

అధ్వానంగా రోడ్లు.. ఆచరణకు నోచుకోని హామీలు

- అటకెక్కిన పల్లె పండుగ
- రహదారుల వ్యవస్థ అస్తవ్యస్తం
- మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
- దశాబ్దాల తరబడి నిర్మాణాలకు నోచుకోని రహదారులు
- మెటల్‌కే పరిమితమైన వైనం



అధ్వానంగా బొద్దులూరుపాడు రోడ్డు



దశాబ్దాల తరబడి నిర్మాణానికి నోచుకోని రావికంపాడు మార్గం

కొల్లూరు : పల్లె పండుగ పేరుతో రహదారుల మరమ్మతులు చేపడతామన్న కూటమి ప్రభుత్వ హామీలు అటకెక్కాయి. సంక్రాంతి పండుగ లోపు రోడ్ల మరమ్మతులు చేపడతామని ప్రభుత్వం అట్టహాసంగా గుప్పించిన వాగ్దానాలు ఆచరణకు మాత్రం నోచుకోకపోవడంతో ప్రజలు ప్రయాణ కష్టాలకు గురవుతున్నారు. దశాబ్దాల తరబడి గ్రామాల మధ్యనున్న రహదారులు నిర్మాణాలకు నోచుకోకపోవడంతో భారీ అగాధాలు ఏర్పడి ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి తోడు ఆరు నెలల క్రితం రహదారుల మరమ్మతుల కోసం రోడ్లను తొలచి మెటల్ లేయర్ వేసి తారు వేయకుండా సగంలోనే వదిలేయడంతో ఆ మార్గాలలో ప్రయాణం ప్రమాదకరంగా తయారైంది. రహదారుల మరమ్మతుల విషయంలో ఆర్ అండ్ బీ యంత్రాంగం నిర్లక్ష్యం ఫలితంగా వేమూరు నియోజకవర్గంలోని రహదారులు అస్తవ్యస్తంగా తయారై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారై ప్రయాణం మరింత కష్టమవుతోంది. కొల్లూరు మండలంలో రావికంపాడు రోడ్డు దశాబ్దాల తరబడి నిర్మాణానికి నోచుకోని కారణంగా పూర్తి అధ్వానంగా తయారై ప్రజలు రాకపోకలు కష్టతరంగా మారాయి. తెనాలి – అనంతవరం, చినపులివర్రు – వేమూరు రోడ్లలో మెటల్ వేసి తారు లేయర్ వేయకుండా పనులను మధ్యలోనే నిలిపి వేయడంతో ప్రయాణికులు ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి కొనసాగుతుంది. దోనేపూడి – పోతార్లంక, బొద్దులూరుపాడు రోడ్లు సైతం నిర్మాణాలు చేపట్టడంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇదే తరహాలో అమృతలూరు మండలం కూచిపూడి రోడ్డు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు మండలాల రోడ్లు అధ్వానంగా తయారైనా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. అస్తవ్యస్తంగా తయారైన రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు తక్షణం చేపట్టి ప్రయాణ కష్టాల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గుడ్..బ్యాడ్ టచ్‌లపై అవగాహన



బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే గుడ్.. బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని శక్తిబృందం ఎస్ఐ అనిత తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం గుడ్.. బ్యాడ్ టచ్‌లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ అనిత మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాల నిషేధ చట్టం, శక్తి మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులకు భద్రత కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా నాలుగు శక్తి బృందాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే శక్తి యాప్ ఆవశ్యకత, చట్టపరంగా మహిళలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించి విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ గురించి ప్రతి విద్యార్థినికి అవగాహన ఉండాలన్నారు. ఎవరైనా బ్యాడ్ టచ్ చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే గట్టిగా అరవాలని, అక్కడి నుంచి తప్పించుకోవాలని సూచించారు. ఆ విషయం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోలీసులకు వెంటనే తెలియజేయాలన్నారు. మహిళలు, విద్యార్థినులు ఏదైనా అనుకోని పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు, పోలీస్ శాఖ తక్షణ సహాయం పొందేందుకు 'శక్తి మొబైల్ యాప్' ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెడ్‌క్వార్టర్ శక్తి బృందం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రేపల్లె: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి రవిబాబు మాట్లాడుతూ సంవత్సరాలుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం జీవో 36 ప్రకారం రూ.24,500 వేతనం అందించాలన్నారు. గతంలో సమస్యల సాధనకై నిర్వహించిన 17 రోజుల సమ్మె కాలంకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు జీవోలు విడుదల చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్, యూనియన్ నాయకులు రవి, రాఘవేంద్రరావు, శివ, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

కొరటాల సేవలు ఎనలేనివి



కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, నాయకులు



అద్దేపల్లిలో మాజీ ఎమ్మెల్యే కొరటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: తీరప్రాంతానికి, పేద ప్రజలకు కొరటాల సత్యనారాయణ చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మాజీ శాసనసభ్యుడు కొరటాల సత్యనారాయణ 19వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయం కొరటాల సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉద్యమాల్లో పాల్గొన్న కొరటాల సత్యనారాయణ కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా అంచెలంచెలుగా ఎదిగిన ప్రజా నాయకుడన్నారు. రేపల్లె ఏరియాలో చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేశారన్నారు. లంక భూముల సమస్యపై నిరంతరం పోరాటాలు నడిపారన్నారు. పేద ప్రజలను సొసైటీలుగా ఏర్పాటు చేసి భూస్వాముల అధీనంలోని లంక భూములను పేదలు సాగు చేసుకునేలా పోరాటాల ద్వారా విజయం సాధించారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైతాంగ ఉద్యమ నాయకుడిగా పేదరైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని చెప్పారు. రేపల్లె నియోజకవర్గం నుంచి రెండు సార్లు శాసనసభకు ఎన్నికై ప్రజా ప్రతినిధిగా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించారన్నారు. అనంతరం కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు వై.కిషోర్, కేవీ లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, జి.దానియేలు, డి.శ్రీనివాసరావు, అగస్టిన్, వెంకటేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కొరటాల సేవలు మరువలేనివి

భట్టిప్రోలు(కొల్లూరు) : కమ్యూనిస్టు ఉద్యమాలలో ముందు వరుసలో ఉండి కార్మికులు, కర్షకులు, చేనేత కార్మికుల సమస్యలపై పోరాడిన రేపల్లె మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అద్దేపల్లిలో కొరటాల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరటాల లంక గ్రామాలలో దళితులకు భూములు ఇప్పించడంతోపాటు, వ్యవసాయ కూలీల పక్షాన నిలిచి వారి తరపున పోరాడారన్నారు. ఆయన చేసిన నిస్వార్థ సేవలకు ఫలితంగా రేపల్లె ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. నేటి ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించి పేదలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్, నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, రామస్వామి, మురుగుడు నారాయణ, గోళ్ల నాగరాజు, పి.మనోజ్‌కుమార్, పప్పుల అహరోను పాల్గొన్నారు.

గురువుల ప్రాముఖ్యతను తెలిపేందుకు బాలవికాస్ కేంద్రాలు



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ

రేపల్లె: పిన్న వయస్సు నుంచే చిన్నారుల్లో సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించేందుకు బాల వికాస్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ చెప్పారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని గంగాభికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10వ తేదీన వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని విద్యార్థులకు గురువుల ప్రాముఖ్యతను తెలిపేందుకు బాలవికాస్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కేంద్రాలలో చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక భావం, పెద్దల పట్ల గౌరవం పెంపొందించటంతో పాటు సృజనాత్మక శక్తిని వెలికి తీసేలా కార్యక్రమాలు నిర్వహించబడునన్నారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమాలలో సభ్యులతో పాటు ప్రజలు పాల్గొనాలని కోరారు. అదే విధంగా 12న సత్సంగం, 6, 21 తేదీలలో ఏకాదశి నగర సంకీర్తనలు, 10వ తేదీన ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామ దేవతలకు సారె సమర్పించే కార్యక్రమాలు నిర్వహించబడునని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, ధర్మ ప్రచారక్ మురళీకృష్ణ, మండల కన్వీనర్లు సీతారాంబాబు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్లు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల తగ్గుముఖం



రైతులకు సూచనలిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి, సిబ్బంది



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి సరళ



మాట్లాడుతున్న ఏవో ప్రేమ్‌సాగర్

భట్టిప్రోలు (కొల్లూరు) : ఖరీఫ్ సాగులో రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేపట్టిన వరి విత్తనాలను మాత్రమే వినియోగించితే పంటకు ఆశించే తెగుళ్ల బెడద తగ్గుముఖం పడుతుందని మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెల్లటూరు, పెదలంక గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా దుకాణదారుడి నుంచి రశీదులు తీసుకని జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. కౌలు రైతు గుర్తింపు కార్డులను తీసుకొని బ్యాంక్ రుణాలు పొందడానికి వినియోగించుకోవాలని కోరారు. ఏఈఓలు కె.లక్ష్మి, ప్రసన్న, వి.బుష్, టి.అఖిల, వీహెచ్ఏలు టి.హిమబిందు, బి.సరిత పాల్గొన్నారు.

మున్నంగివారిపాలెంలో

చుండూరు(వేమూరు): ఖరీఫ్ సీజన్‌లో వెద సాగు చేస్తున్న రైతులందరు విత్తన శుద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సరళ అన్నారు. చుండూరు మండలంలోని చుండూరు, మున్నంగివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎక్కువ శాతం వెద సాగు చేయాలని, విత్తనాల మొలక శాతం పరిశీలించి వెద సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించడం జరుగుతుందన్నారు. అందువల్ల రైతులు విత్తనాలను మొలక శాతం కట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆదంబాబు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వరహాపురం(వేమూరు): రైతులు విత్తనాల వెద సాగుకు రెండు, మూడు రోజుల ముందు మొలక శాతం కట్టు కోవాల్సిందిగా మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. వేమూరు మండలంలోని వరహాపురం, బలిజేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ విత్తనాలు 80 శాతం మొలకెత్తితే వెద సాగు చేయాలని ఆయన తెలిపారు. వరి విత్తనాలు రాయితీపై ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వరహాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పి.దీప్తి, అభ్యుదయ రైతులు పోలు ప్రసాద్, తుమ్మల శ్రీనివాసరావు, యలవర్తి సాంబశివరావు పాల్గొన్నారు.

కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలి



మాట్లాడుతున్న ఏవో హేమంత భరత్

అమర్తలూరు(వేమూరు): రైతులందరు కౌలు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత భరత్ అన్నారు. అమర్తలూరు మండలంలోని కోడితాడిపర్రు, ఇంటూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెద సాగు చేసే రైతులందరు విత్తన శుద్ధి చేయాలన్నారు. వెద సాగు చేసిన 48 గంటల లోపు కలుపు మందు పెండిమేతలిన్ 700 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.మణికంత, డి.మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.భాస్కర్, పి.మణికంత, వై.భార్గవి, వీఆర్వో ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ లక్ష్మి, ఏరువాక కేంద్రం అధికారి డాక్టర్ ఉష

రేపల్లె: సస్యరక్షణ పద్ధతులను అవలంభించి సాగులో నాణ్యతతో కూడిన దిగుబడులు సాధించాలని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి 1, 2 గ్రామాలలో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం సాగు ప్రారంభించేందుకు రైతులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచటం జరిగిందని, రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి, భూసారం శాతం, దుక్కులు దున్నటం, ఎరువుల వినియోగం వంటి అంశాలలో సందేహాలు కలిగితే వ్యవసాయ అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఏరువాక బాపట్ల కేంద్రం అధికారి డాక్టర్ ఉష మాట్లాడుతూ భూసారాన్ని బట్టి ఎరువుల వినియోగం చేయాలన్నారు. పశువుల వ్యర్థాలు, సేంద్రియ ఎరువుల వినియోగంతో కాలుష్యం తగ్గించిన వారిమవుతామన్నారు. ఆర్‌జీఎల్–7034, 7039, ఎంటీయూ 1443, బీపీటీ 2856 రకాల విత్తనాలను రైతులకు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. సాగులో సమస్యలు ఎదురైతే తమ పరిధిలోని వ్యవసాయ సహాయ కేంద్రంలో సంప్రదించాలన్నారు. వివిధ రకాల వరి విత్తనాల కాలపరిమితి, వాటి స్వభావంను రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలోని సాగు భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో అవ్వారు మహేష్‌బాబు, వీఆర్వో ఏ వెంకటేశ్వర్లు, ఏఈవో కే సుమంత్, వీఏఏలు రాయల్‌బాబు, హర్షమాధురి, ఎంపీఈవో ప్రసాద్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

భగవంతుడి ప్రతిరూపమే వైద్యులు

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు

బాపట్ల: భగవంతుడి ప్రతిరూపమే వైద్యులని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయమ్మ, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధార్థ, పద్మావతి, చల్లా రామమోహనరావు, మిండాల వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ సందర్భంగా బి.ఎస్.నారాయణభట్టు మాట్లాడుతూ వైద్యులు ప్రత్యక్ష దేవుళ్లతో సమానమని చెప్పవచ్చన్నారు. వైద్య వృత్తిలో కొనసాగటం ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో రమణబాబు, రామసుబ్బారావు, జాషువా, లావణ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

జంపని(వేమూరు): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నూరు శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి బాషా తెలిపారు. మండలంలోని జంపనిలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పింఛన్లు పంపిణీ నూరు శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎంపీడీవో రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.